అసంపూర్తిగా ప్రభుత్వ దవాఖాన

- బిల్లులు అందక భవన నిర్మాణ పనులు నిలిపేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థకు చేరుకున్న ప్రస్తుత దవాఖాన భవనం
- ఇబ్బందుల్లో వైద్యులు, రోగులు

నిలిచిపోయిన ప్రభుత్వ దవాఖాన నూతన భవన నిర్మాణ పనులు

మెట్‌పల్లి, ఆగస్టు 11: మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన నూతన భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఏడాదిన్నర కాలం పూర్తయిన పనులు ముందుకు సాగడంలేదు. నిధులు విడుదలలో జాప్యం, చేతికందని బిల్లులతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు అర్థంతరంగా నిలిపేశారు. ప్రస్తుతం దవాఖాన కొనసాగుతున్న భవనం సుమారు 60ఏళ్ల క్రితం నిర్మించగా, శిథిలావస్థకు చేరుకున్నది. స్లాబ్ కింది భాగంలో పెచ్చులూడడం, ఇరుకుగా ఉండడం, వర్షం కురిసినప్పుడు స్లాబ్‌పై నుంచి కిందకు ఊరుస్తుండటం రోగులు, వైద్యులు, సిబ్బందికి ఇబ్బంది తప్పడం లేదు. మరో వైపు ఇక్కడ ప్రతి రోజూ 250 నుంచి 300 వరకు ఓపీ ఉంటుంది. మెట్‌పల్లి పట్టణంతోపాటు మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహింపట్నం మండలాలతోపాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని మోర్తాడ్, కమ్మర్‌పెల్లి, ఏర్గట్ల, ఖానాపూర్, కడెం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి ప్రసవాల కోసం గర్భిణులు వస్తుంటారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు మెరుగైన వసతులతో కూడిన వైద్య సేవలు అందించాలనే సదాశయంతో ప్రభుత్వ దవాఖానాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. అందుకు అనుగుణంగా నిధుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత కల్పించింది. ఇందులో భాగంగా మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖాన (సామాజిక వైద్యశాల)కు ఆధునాతన వసతులతో కూడిన నూతన భవన నిర్మాణం కోసం జాతీయ ఆరోగ్య మిషన్, వైద్యారోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ₹7.50కోట్లు కేటాయించింది. 2023 జనవరి 5న అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా 30 పడకల దవాఖాన కోసం జీ ప్లస్ వన్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పనులు ప్రారంభమై చకాచక సాగిన గత ఆరు నెలల నుంచి పనులు కుంటుపడ్డాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం రావడంతో భవన నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. చేసిన పనులకు బిల్లులు అందక పోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ముందుకు కొనసాగించలేక అర్థంతరంగా నిలిపేశారు. ప్రస్తుత ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా గత నెల 24న మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. నిలిచిన నూతన భవన నిర్మాణ పనులపై ఆరా తీశారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను అక్కడికి పిలిచి అడిగగా బిల్లులు రావడం లేదని చెప్పడంతో నిధుల విడుదల విషయమై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి పోలీస్ భవనం

జిల్లా కేంద్రంలోని పోలీస్ భవనం

జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాకో పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. కాగా, జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లోని ఎస్సారెస్పీ భూముల్లో నిర్మించిన పోలీస్ ప్రధాన కార్యాలయాల భవన సముదాయాన్ని 2023లో అప్పటి ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కేటీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం పనులన్నీ పూర్తి కావడంతో జిల్లా కేంద్రంలోని పోలీస్ భవనం అందుబాటులోకి వచ్చిందని, ఆదివారం నుంచి పూర్తి స్థాయిలో నూతన భవనం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు.

- జగిత్యాల కలెక్టరేట్, ఆగస్టు 11

ఆస్తిపన్ను వసూళ్లలో మార్పులు

- మున్సిపల్ నూతన నిబంధనలు అమలు చేయాలని ఆదేశాలు జారీ

జగిత్యాల, ఆగస్టు11: ఆస్తి పన్ను వసూళ్లలో కొన్నిచోట్ల అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. వాటిని అరికట్టేందుకు తాజాగా మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్ల విధానంలో మార్పులు చేసింది. నగదు లావాదేవీల నిర్వహణ నుంచి ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తప్పించాలని ఆదేశాలు జారీ చేసింది. పౌర సేవా కేంద్రంలో నేరుగా ఆస్తి పన్ను స్వీకరించి కంప్యూటరైజ్డ్ రసీదు ఇచ్చే విధానానికి స్వస్తి పలకాలని సూచించింది.

జగిత్యాల మున్సిపల్ కార్యాలయం

రెగ్యులర్ ఉద్యోగులకే బాధ్యతలు

పట్టణాల్లో ఏటా సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లు చేసి ప్రజలకు రసీదును అందిస్తుంటారు. ప్రజల నుంచి సేకరించిన నగదును మున్సిపల్ కార్యాలయంలో జమ చేస్తారు. చాలా చోట్ల హ్యాండ్ హెల్ట్ మెషీన్స్ రెగ్యులర్ ఉద్యోగుల పేరిటే ఉన్నాయి. అయితే ఉద్యోగుల కొరత కారణంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేదు. దీంతో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పన్నువసూళ్ల నుంచి తప్పించి రెగ్యులర్ ఉద్యోగుల ద్వారానే నగదు లావాదేవీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉన్నది. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని మినహాయిస్తే పన్ను వసూళ్లపై ప్రభావం పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్‌పై వేటు!

- ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్డ్

మెట్‌పల్లి, ఆగస్టు11: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓ మహిళను చితక్కొట్టిన ఏఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్‌పై వేటు పడింది. ఈ ఇద్దరిని జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్డ్ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ ఆదివారం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మూడు రోజుల క్రితం ఓ మహిళ తన భర్తతో గొడవ పడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ మరోసారి గొడవపడ్డారు. ఈ క్రమంలో వారికి సర్దిచెప్పకుండా మహిళా కానిస్టేబుళ్లు కూడా ఉండగా అవేమి పట్టించుకోకుండా ఏఎస్ఐ ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్ మహిళను కొట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శాఖాపరమైన చర్యల్లో భాగంగా ఇద్దరిని జిల్లా కేంద్రానికి అటాచ్డ్ చేసినట్లు సమాచారం.

కరెంట్‌షాక్‌తో యువతి మృత్యువాత

- హైదరాబాద్‌లో ఘటన

కోరుట్ల, ఆగస్టు 11: కోరుట్ల పట్టణంలోని బాలాజీ రోడ్డుకు చెందిన యువతి హైదరాబాద్‌లో మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ రోడ్డుకు చెందిన చిలుమల రాధాకృష్ణ-భూమక్క దంపతుల కుమార్తె అరుణ(25) డిగ్రీ పూర్తి చేసింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ కార్యాలయంలో మూడేళ్లుగా ఉద్యోగం చేస్తున్నది. తాను పని చేస్తున్న కార్యాలయం ముందు భాగంలో ఆఫీస్‌కు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేస్తుండగా, పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు బోర్డు తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కార్యాలయ ఉద్యోగులు దవాఖానకు తరలించగా, మృతి చెందింది. అరుణ మృతితో కోరుట్లలో విషాదఛాయలు అలుముకున్నాయి.